క్లుప్తంగా

రేపు అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సోమవారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ సంక్షేమ సంఘం 2024 క్యాలెండర్‌ను ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్.కృష్ణయ్య స్థాపించిన బీసీ సంక్షేమ సంఘం ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తి చేసుకోగా.. ప్రజా సమస్యలపై అలుపెరుగని సుదీర్ఘ పోరాటం నిర్వహించారని అన్నారు. బీసీ సంఘానికి ఆ గుర్తింపు దక్కిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిడికిళ్ల శ్రీనివాసులు, వర్కింగ్ ప్రసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్, కన్వీనర్ రవీందర్‌గౌడ్, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కొత్త శ్రీను, గంగోజి, నిరంజన్ యాదవ్ పాల్గొన్నారు.

బీసీ సంఘం నాయకులు

సర్పంచ్‌లపై కక్షసాధింపు తగదు

కల్వకుర్తిరూరల్: సర్పంచ్‌లపై అధికార పార్టీ కక్ష సాధింపు చర్యలకు దిగడం సముచితం కాదని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కల్వకుర్తి పట్టణంలో విలేకరులతో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో కలిసి మాట్లాడారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు రాక ఎంతో మంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. మండలంలోని పంజుగుల సర్పంచ్ పద్మ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, 2021లో గ్రామానికి చెందిన ఒకరు ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదుపై డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ జరిపి అవినీతి లేదని నివేదిక ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మరోసారి పాత ఫిర్యాదుపైనే విచారణ చేసి అవినీతి జరిగిందని 40 రోజుల పాటు సస్పెన్షన్ వేస్తున్నట్లు ఆదేశాలు ఇచ్చారని తెలియజేశారు. ఇద్దరు ప్రభుత్వ అధికారులు ఒకరు ఒకలాగ, మరొకరు మరోలాగ నివేదిక ఇవ్వడంపై హైకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. సర్పంచ్‌లు ఎక్కువగా బడుగు బలహీన వర్గాల వారే ఉన్నారని, వారిని ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ గోవర్దన్, ఈశ్వరయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

కొల్లాపూర్ రూరల్: పట్టణంలో తెనుగోళ్ల విద్యావంతుల వేదిక అధ్యక్షుడు డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఉచిత గురుకుల మెటీరియల్‌ను డీఎఫ్‌సీఎస్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు, సింగిల్ విండో చైర్మన్ కృష్ణయ్య శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. గురుకుల మెటీరియల్‌ను ఉపయోగించుకుని సీట్లు పొందాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సందు యాదగిరి, శ్రీను, శ్రీనయ్య, నారాయణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు మండల కమిటీ ఎన్నిక

కోడేరు: మండల కేంద్రంలోని మాలమహానాడు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు యాదగిరి, లక్ష్మణ్, స్వామి తెలిపారు. అధ్యక్షుడిగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా ఎలకంటి మహేష్, సెక్రటరీగా పబ్బటి మల్లికార్జున్, జనరల్ సెక్రెటరీగా అవుట బాలపీరు, కోశాధికారిగా ఇళ్ల సుధాకర్, సలహాదారులుగా రంగదాసు, నర్సింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

శనేశ్వరుడికి పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన జైష్ఠాదేవి సమేత శనేశ్వరుడికి భక్తులు తిలతైలాభిషేకాలతో ప్రీతికర పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. శనివారం తెల్లవారుజాముననే భక్తులు ఆలయానికి చేరుకుని తిలతైలాభిషేక పూజలు, గోత్రనామార్చన, ప్రదక్షిణలు వంటి పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మసూత్ర శివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు వట్టెం వెంకన్న కల్యాణం..

బిజినేపల్లి: మండలంలోని వట్టెంలో గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి, అమ్మవారి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి కల్యాణం కోసం అశేషమైన భక్తులు రానున్నారని, స్వామి వారి కల్యాణం సులభంగా తిలకించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని వివరించారు.

రామాలయంలో కల్యాణోత్సవం..

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని రామాలయంలో ఆదివారం దేవతామూర్తుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. నెల రోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస పూజల్లో భాగంగా దేవతామూర్తుల కల్యాణ వేడుకలు ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

సోమశిలలో వెంకటేశ్వర స్వామి..

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిలలో వెలిసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం ఆలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు.

బ్రహ్మోత్సవాలకు ఎత్తంగట్టు ముస్తాబు

- కోర్కెలు తీర్చే రామలింగేశ్వరస్వామి
- వేడుకలు తిలకించేందుకు వస్తున్న వేలాది మంది భక్తులు



రామలింగేశ్వరస్వామి మూలవిరాట్



1400 అడుగుల ఎత్తులో ఉన్న ఎత్తం రామలింగేశ్వరస్వామి గట్టు



ముస్తాబైన ఆలయం

కోడేరు: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ఎత్తంగట్టు రామలింగేశ్వరస్వామి. ప్రతిఏటా సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు వేడుకలు ఘనంగా కొనసాగుతాయి. వేడుకలను తిలకించేందుకు వేలాది మంది భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. సంక్రాంతి పండుగ రోజు స్వామిని దర్శించుకోవడంతో సకల పాపాలు తొలగి కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. కోడేరు మండలం ఎత్తంకి రెండు కిలోమీటర్ల దూరంలో ఎత్తం రామన్న గట్టు వెలిసింది. దీని ఎత్తు దాదాపు 1400 అడుగులు ఉంటుంది. త్రిభుజకారంలో ఉన్న గట్టు శిఖరంపై శివకేశవ లింగ రూపంలో రామలింగేశ్వర స్వామి దర్శనం ఇస్తారు.

- కండ్ల నీలాలు, సుష్టి, పట్టం, కొరమీసాలు కలిగి ఉన్న రామలింగేశ్వరస్వామికి జనవరి 14న మకర సంక్రాంతి పండుగ రోజు సామగ్రితో అలంకరించి అత్యంత వైభవంగా పూజలు నిర్వహిస్తారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, రాయిచూర్ నుంచి భక్తులు వచ్చి స్వామివారికి తలనీలాలు, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. వేలాది మంది భక్తులు కాలినడకన గట్టుపైకి వస్తుంటారు. గట్టుపై కేవలం రెండు అడుగుల వెడల్పు మాత్రమే ఉంటుంది. స్వామిని దర్శించుకోవాలంటూ మనస్సులో తలచుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయి. పండుగ రోజు గట్టుపై మకర జ్యోతి దీపం వెలిగించడంతో ఈ దీపం కర్నూల్, రాయిచూర్, గద్వాల, ఇతర రాష్ట్రాలకు కనిపిస్తుంది.

కాకతీయుల కాలంలో..

కాకతీయుల కాలంలో వేపూర్ హనుమదాసు, గొల్లపల్లి వెంకటదాసు వంటి వారు స్వామిని దర్శించుకున్నారని పూజారి మురళీధర్ తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు భక్తుల సందడి ఏమాత్రం తగ్గకుండా మొక్కులు తీర్చుకుంటున్నారు. గట్టుపై ఒకసారి కాకుండా మూడుసార్లు వెళ్లి స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగి సుఖసంతోషాలతో ఉంటారని పూజారులు తెలిపారు. అప్పటి నుంచి భక్తులు ఆనవాయితీగా మూడుసార్లు గట్టుపైకి వెళ్తారు. గట్టుపై వివిధ రకాల జంతువులు, వృక్షాలు ఉంటాయి. నెమళ్లు, రకరకాల పాములు, రంగు రంగుల పక్షులతో పాటుగట్టు ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది.

తప్పకుండా వర్షాలు..

మండలంలో వర్షాలు రాకపోయినా గట్టుపైకి వెళ్లి భజనలు చేస్తూ వరుణపాయసం చేసి రాత్రివేళలో దీపారాధన చేస్తే తప్పకుండా వర్షాలు కురుస్తాయని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వామివారికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారని పూజారులు తెలిపారు.

విద్యుత్, తాగునీరు ఏర్పాటు

ప్రతి మకర సంక్రాంతి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రాత్రివేళలో విద్యుత్ దీపాలు, తాగునీటి వసతి కల్పించినట్లు తెలిపారు. అన్నదానంతో పాటు తీర్థ ప్రసాదాలు అందిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కోరిన కోర్కెలు తీరుతాయి..



స్వామివారిని దర్శించుకోవడంతో కోరిన కోర్కెలు తీరుతాయి. అక్కడ భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. తాత ముత్తాతల నుంచి గట్టుపైకి వెళ్లేవాళ్లం. నేను వయస్సులో ఉన్నప్పుడు పది సార్లు గట్టుపైకి వెళ్లి మొక్కులు తీర్చుకున్నా.

– దొరస్వామి, ఎత్తం

మహిమగల దేవుడు

ఎత్తం గట్టుపై వెలిసిన రామలింగేశ్వరుడు ఎంతో మహిమ గల దేవుడు. స్వామిని తలచుకుంటూ ఏ పని చేసినా ఖచ్చితంగా నెరవేరుతుంది. సకల పాపాలు తొలగుతాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా భక్తులు వేలాదిగా దర్శించుకుంటారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం రామలింగేశ్వరుడు.

– మురళీ, పూజారి

రేపటి నుంచి ఈదమ్మ ఉత్సవాలు



చెర్యూర్‌లో ఈదమ్మమాందాత ఉత్సవమూర్తులు

వెల్దండ: మండల పరిధిలోని చెర్యూర్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు ఈదమ్మ మాదాంత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ప్రతి ఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా ఉత్సవాల్లో బండిశిడే ఆసక్తికరంగా ఉంటుందన్నారు. ఈ నెల 15న బండిశిడే, 16న బోనాలు, 17న ఎద్దులు, వాహనాలు, సవారమ్మ బోనాలు నిర్వహిస్తారు. 14 నుంచి 16 వరకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బైలునాటకం, 15 నుంచి 16 వరకు శ్రీ రేణుక ఎల్లమ్మ బయలు నాటక ప్రదర్శన చేస్తామన్నారు. ఉత్సవాలకు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొంటారు.

ఘనంగా గోదా రంగనాయక కల్యాణోత్సవం



లింగాల రామాలయంలో గోదా కల్యాణం, కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

లింగాల: ధనుర్మాసం ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని కోదండరామాలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు రామాచారీ, సుదర్శనాచారీ ఆధ్వర్యంలో గోదా రంగనాయక కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఇదే సమయంలో దంపతులతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. గోదా రంగనాయక కల్యాణం సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

కందనూలు: శ్రీపురం రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త రంగాచార్యులు ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో సుప్రభాత సేవ, సామూహిక అభిషేకాలు, అర్చనలతో పాటు తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణతో శ్రీపురంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

నేడు గోదా రంగనాథుల స్వామి కల్యాణం..

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోదా రంగనాథ స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కల్యాణం కోసం ఆలయంలో భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వందలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడుదాం..



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి

నాగర్‌కర్నూల్ రూరల్: దేశంలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పకొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాల కాలం పూర్తవుతున్నా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. లౌకిక దేశంలో అత్యున్నత పదవిలో ఉన్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఒక వర్గానికి కొమ్ముకాసేలా ప్రయత్నాలు చేస్తున్నారని, మిగతా వర్గాలను తక్కువ చేయడమే అని అన్నారు. పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, వర్దం పర్వతాలు, పొదిల రామయ్య, అశోక్, ఈశ్వర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



బహుమతి అందుకుంటున్న మహిళలు

నాగర్‌కర్నూల్ రూరల్: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందికొండ గీత అన్నారు. శనివారం ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఈదమ్మ ఆలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి అందజేసి మాట్లాడారు. మహిళలు నిరంతరం ఇంటి పని, వంట పనికి మాత్రమే పరిమితం అవుతున్న పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీలక్ష్మీ, సభ్యులు శోభ, ఈశ్వరమ్మ, వసంత, రమాదేవీ, విజయ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దనే వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు



బాధితుడికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

తెలకపల్లి: వృద్ధులకు ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తామని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సెక్రెటరీ రమేష్‌రెడ్డి అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబులిటీ సీనియర్ సిటిజన్‌లకు భారత ప్రభుత్వ సహకారంతో వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తామన్నారు. శనివారం మండల పరిధిలోని నడిగడ్డలో వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బీపీ, షుగర్, ఇతర పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి రాధాకృష్ణ, రాజ్‌కుమార్, కుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి వస్తువుల వితరణ..

తెలకపల్లి: మండల పరిధిలోకి కార్వంగలో గోపస్ చిన్ననిరంజన్ ఇటీవల అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయిన ప్రమాదంలో రూ.3 లక్షల నగదుతో పాటు ఆస్తి కోల్పోయిన ఘటన పాఠకులకు విధితమే. శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు గ్రామానికి చేరుకుని బాధితుడు చిన్ననిరంజన్‌కు వస్తువులు, తిండి సామగ్రి, దుప్పట్లు, టార్పాలిన్ కవర్లు, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. రామకృష్ణ, రాజ్‌కుమార్, కుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఎదుగుదలకు క్రీడలు అవసరం



ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి చేతుల మీదుగా కప్ అందుకుంటున్న కార్వంగ టీం



కుప్పగండ్లలో టోర్నీ ప్రారంభిస్తున్న నాయకులు

కందనూలు: వ్యక్తి మానసిక ఎదుగుదలకు విద్యతో పాటు క్రీడలు అవసరమని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. జేఎస్‌ఆర్ ఫౌండేషన్ సహకారంతో జమ్ము సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా టోర్నీలో గెలిచిన కార్వంగ టీంకు రూ.లక్ష నగదుతో పాటు కప్‌ను అందజేశారు. రన్నర్‌గా నిలిచిన వనపట్ల టీమ్‌కు రూ.50 వేల నగదుతో పాటు కప్‌ను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాలో క్రీడాకారులకు కొదువే లేదని చెప్పారు. రాష్ట్రంలో జిల్లా వెనుకబడిన ప్రాంతం కావడంతో కనీసం క్రీడా సౌకర్యాలు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులు సౌకర్యాలను ఉపయోగించుకొని మండల స్థాయి నుంచి జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారులు రాణిస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు గౌడ్, ఈశ్వర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం..

వెల్దండ: మండల పరిధిలోని కుప్పగండ్ల, నారాయణపూర్, పెద్దాపూర్ తదితర గ్రామాల్లో శనివారం క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుప్పగండ్లలో సర్పంచ్ శారదమ్మ టోర్నీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. నాయకులు వెంకట్‌రెడ్డి, సింగల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, అశోక్, రమేష్, గోపాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

సంక్రాంతి సంబరాలు



తాడూరు: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో చిన్నారులు, యువకులు, యువతులు సంక్రాంతి సంబరాల్లో మునిగారు. చిన్నారులు గాలిపటాలు ఎగరవేయడం, ముంగిళ్లలో ముగ్గులు వేసుకోవడం వంటి వాటిలో నిమగ్నమయ్యారు.

ఉత్సాహంగా క్రీడల పోటీలు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని క్రీడల పోటీలు ఉత్సాహంగా శనివారం ప్రారంభించారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ స్టేడియం గ్రౌండ్‌లో రామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు, పాత బస్తీలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. శ్రీను, సంజీవ్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు..

కందనూలు: మకర సంక్రాంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఈదమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమ ప్రగతి గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దలకు ముగుల పోటీలతో పాటు చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని గోప్లాపూర్‌లో సంక్రాంతి సందర్భంగా యూపీఎల్ ఎస్‌ఐఎస్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో గ్రామంలో శివాలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహేశ్‌కుమార్, రాఘవేంద్రారెడ్డి, మేడిపల్లి రవీందర్‌రెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

వరిలో వెదజల్లే పద్ధతిపై అవగాహన



బిజినేపల్లి: పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలోని రావేఫ్ విద్యార్థులు తిమ్మాజీపేట మండలంలోని ఆవంచలో వరిలో వరినాటు పద్ధతిని కాకుండా వెదజల్లే పద్ధతిపై ఆ గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. ఆవంచకి చెందిన రైతు సురేందర్‌రెడ్డి రైతు పొలంలో వేదజల్లే పద్ధతి ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ పద్ధతిలో శ్రామికశక్తి తగ్గి, పెట్టుబడి వ్యయం తగ్గుతుందని వివరించారు. డ్రమ్ సీడర్‌తో విత్తుకోవడంతో మరింత దిగుబడి పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు జయశ్రీ, అంకిత, సంపూర్ణ, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రాంతం రాంపూర్ పెంటలో తల్లి ఇద్దరు పిల్లల ఆత్మహత్య సంఘటనకు సంబంధించి అటవీశాఖ, వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో తక్షణ సాయంగా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. శనివారం అటవీశాఖ అధికారి డీఎఫ్ఓ రోహిత్ గోపిడి ఆదేశాల మేరకు డీఆర్ఓ రవికుమార్, ఎఫ్ఎస్ఓ గురువయ్య సమక్షంలో అటవీశాఖ సిబ్బంది పెంటకు వెళ్లారు. ఈ సందర్భంగా ఫారెస్టు బేస్ క్యాంపులో వాచర్‌గా విధులు నిర్వహిస్తున్న చిగుర్ల చిన్న బయ్యన్నను కలిసి ఓదార్చి సానుభూతి తెలియజేశారు. బాల గురువయ్య, రాజు, ప్రవీణ్, సలీం, చెంచు నాయకులు పాల్గొన్నారు.

‘ప్రతి పండుగలో ఓ ప్రత్యేకత’

మన్ననూర్: దేశ వ్యాప్తంగా హిందువులు జరుపుకొనే ప్రతి పండుగలో సైన్స్ దాగి ఉంటుందని స్వయం సేవక్ సంఘ్ జిల్లా సహ బోధక్ లక్ష్మీకాంత్ అన్నారు. శనివారం మన్ననూర్‌లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామస్తులు, చిన్నారులకు హిందూ పండుగల విశిష్టతలను ఆయన తెలియజేశారు. జనవరి మాసంలో ఉండే తీవ్రమైన చలి నుంచి రక్షించుకునేందుకు నువ్వులు, బెల్లంతో తయారు చేసిన రొట్టెలను ఆహారంగా తీసుకుంటారని చెప్పారు. ప్రతి పండుగకు ఓ ప్రత్యేకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, శ్రీనివాసులు, శ్రీకాంత్, జయమ్మ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

కొల్లాపూర్: పట్టణంలోని ఐదో వార్డులోని శివాలయం సమీపంలో శనివారం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. పనులను మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మహిమూదాబేగం పరిశీలించారు. వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఖాదర్ పాష తదితరులున్నారు.

తల్లి జ్ఞాపకార్థం వీధిదీపాల ఏర్పాటు

దోమలపెంట: దోమలపెంటలో తన తల్లి కె.రాములమ్మ జ్ఞాపకార్థం వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నామని కటకం వెంకట్ శనివారం తెలిపారు. గ్రామంతో పాటు ఈగలపెంట, గోవిందరాజులు నగర్, ఎడమ పాతాళగంగ ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తొలి విడతగా 70 దీపాలు తీసుకొచ్చానని, మరో రెండు మూడు రోజుల్లో దీపాలు తీసుకురానున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామస్తుల సంక్షేమార్థం గ్రామానికి ఉచితంగా అంబులెన్స్‌ను, మార్కండేయ శివాలయం అభివృద్ధి కోసం రూ.లక్షను వెంకట్ అందజేశారు. గ్రామస్తులతో పాటు శ్రీశైలానికి రాకపోకలు సాగించే వారు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురైతే అంబులెన్స్ సేవలు పొందుతారన్నారు. వెంకట్ చేస్తున్న సేవలను సర్పంచ్ శారద, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రవిగౌడ్ అభినందించారు.

బాధితుడికి పరామర్శ

కోడేరు: మండల కేంద్రానికి చెందిన నందిని పాము కాటుకు గురై నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు పరామర్శించారు. అదే విధంగా శివ, రమేష్ అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స పొందుతుండటంతో వారిని కూడా పరామర్శించారు.

ఇంటింట అయోధ్య అక్షతల పంపిణీ



తర్నికల్‌లో పంపిణీ చేస్తున్న భక్తులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో శనివారం అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షతలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. సురేష్‌గౌడ్, లింగోజి, వెంకటయ్య, శ్రీధర్ గౌడ్, గణేష్, రాణి, అంజలి పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని శాంతిగూడెం, అయోధ్యనగర్‌లో శనివారం అయోధ్య రాముడి అక్షతలను సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంలో అక్షతలకు ఆలయ అర్చకులు లక్ష్మణ్ శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను ప్రతిఇంటికి పంపిణీ చేశారు. ఈ నెల 22న రామమందిరం ప్రారంభం సందర్భంగా.. ప్రతిఒక్కరూ ప్రత్యేక పూజలు నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో శాంతిగూడెం సర్పంచ్ అనిశెట్టి శ్రీను, లక్ష్మి ఆదినారాయణ, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండలంలోని తెలుగుపల్లిలో శనివారం అయోధ్య రాముడి అక్షతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సహకార సంఘం నాయకులు లింగయ్య, డాక్టర్ వెంకటయ్య, సాయికుమార్, బాలస్వామి తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: అతి పవిత్రమైన అయోధ్య రాముడి అక్షతలను గ్రామంలో పంచిపెట్టారు. కార్యక్రమంలో శ్రీరాముగౌడ్, ఉమాపతి ఆచార్యులు, శేఖర్, రవి, రవికుమార్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో శనివారం ఇంటింట అయోధ్య అక్షతలు పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రధాన విధుల వెంట శ్రీరామ నామస్మరణతో భజనలు, కీర్తనలు చేస్తూ.. ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయులు, రవి, తదితరులు ఉన్నారు.